సంక్షిప్తంగా..

■ **పశువులకు టీకాలు..** జక్రాన్‌పల్లి, మార్చి 26: మండలంలోని అర్గుల్ గ్రామంలో పశువులకు మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశామని మండల పశు వైద్యాధికారి శిరీష తెలిపారు. కొన్ని జీవాలకు నట్టల నివారణ మందు వేశామని ఆమె చెప్పారు.

■ **నేడు తూంపల్లి సొసైటీ మహాజనసభ..** సిరికొండ, మార్చి 26 : మండలంలోని తూంపల్లి సొసైటీ మహాజన సభను చైర్మన్ రాములు నాయక్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్నట్లు వింజో కార్యదర్శి దేవీలాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, డైరెక్టర్లు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

■ **చందూర్ సొసైటీలో వైద్య శిబిరం..** చందూర్, మార్చి 26 : మండలకేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘ భవనంలో మంగళవారం స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. హమాలీ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ మాధవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

■ **సాగర్ కెనాల్‌వైపు వెళ్లొద్దు..** చందూర్, మార్చి 26 : నిజాంసాగర్ కెనాల్ నుంచి ఆయకట్టు పంటలకు నీటి విడుదల కొనసాగుతున్నందున పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శాంత సూచించారు. కెనాల్ వైపు వెళ్లొద్దని ఆమె హెచ్చరించారు.

■ **రేపు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం..** ఇందల్వాయి, మార్చి 26 : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు ఎంతో సహకరించారని పేర్కొన్నారు. అర్చకుడు గోపి ఆధ్వర్యంలో నిర్వహించే వార్షికోత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

■ **ధర్మభిక్షం వర్ధంతి..** ఖలీల్‌వాడి, మార్చి 26 : నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో బొమ్మగాని ధర్మభిక్షం 13వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. ఎమ్మెల్యే, ఎంపీగా ధర్మభిక్షం అందించిన సేవలు, ప్రజా పోరాటాలను జిల్లా కార్యదర్శి సుధాకర్ గుర్తుచేశారు. కార్యక్రమంలో నర్సింగరావు, రఘురాం, అంజలి, సురేశ్, ఆనంద్ పాల్గొన్నారు.

■ **మీసేవ క్యాలెండర్ ఆవిష్కరణ..** సిరికొండ, మార్చి 26 : మీసేవ, సీఏసీ ఆపరేటర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను తహసీల్దార్ రవీందర్‌రావు, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, ఎస్సై రమేశ్ చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ గంగారాజన్, నాగన్న, ధరణి ఆపరేటర్ శ్రీధర్, గోపి, సునీల్, రాజేందర్, సయ్యద్ ఆసిఫ్, తిరుపతి, రాజ్‌కుమార్, శ్రీరాంగౌడ్, హరీశ్, షకీల్, అన్వర్, రవి, సాయిలు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రారంభం

సిబ్బంది కితక్షణమే ఉత్తర్వులు అందజేయాలి: కలెక్టర్

కంఠేశ్వర్, మార్చి 26: పార్లమెంట్ ఎన్నికల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు నేతృత్వంలో మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసీ హాల్‌లో నిర్వహించారు. జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులతోపాటు ఇతర అధికారులను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. 6 సెగ్మెంట్లకు రిజర్వు సిబ్బందిని కలుపుకొని మొత్తం 7711 మందితో ర్యాండమైజేషన్ నిర్వహించారు. వీరిలో పీవోలు 2,008 మంది, ఏపీవోలు 2056, ఓపీవోలు 3,647 మంది ఉన్నారు. సిబ్బందికి శిక్షణ ఇస్తామని, వారికి తక్షణమే ఉత్తర్వులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, సీపీవో మల్లికార్జున్, శ్రీకాంత్, ఎన్ఐసీ అధికారి రవికుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

పొట్టిగుట్ట తండాపై డెంగీ పంజా

■ వైద్య బృందం ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు

ఆరోగ్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వర్ని, మార్చి 26: మండలంలోని పొట్టిగుట్ట తండాపై డెంగీ పంజా విసిరింది. మూడు నెలలుగా తరచూ ఒకరిద్దరు ఈ వ్యాధితో బాధపడగా, ఈ ఒక్క నెలలోనే 12 మందికి డెంగీ సోకింది. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీవిద్య ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి సర్వే చేపట్టగా విషయం వెలుగులోకి వచ్చింది. మూడు నెలలుగా మొత్తం 24 మందికి డెంగీ సోకినట్లు తెలిసింది. తండావాసులు కొన్ని రోజులుగా జ్వరాలతో బాధపడుతుండడంతో స్థానికుల సమాచారం మేరకు మోస్రా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో టెస్టులు నిర్వహించారు. డెంగీ సోకినట్లు గుర్తించి చికిత్స అందించారు. తాజాగా ప్రత్యేక వైద్య బృందం తండాలో పర్యటించి జ్వరంతో బాధపడుతున్నవారికి రక్త పరీక్షలు నిర్వహించింది. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించింది. కార్యక్రమంలో మోస్రా వైద్యాధికారి విజయ్ కుమార్, జాకోరా పల్లె దవాఖాన వైద్యాధికారి సుధాకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఏఎన్ఎంలు మేరీ, జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పరీక్ష ఫీజు చెల్లించాలి

డిచ్‌పల్లి, మార్చి 26 : టీయూలోని ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫీజు తేదీలను పరీక్షల నియంత్రణాధికారిణి ఆచార్య ఎం.అరుణ ప్రకటించారు. ఫీజు చెల్లించేందుకు ఏప్రిల్ ఒకటో తేదీ వరకు గడువు ఉన్నదని, వంద రూపాయల అపరాధ రుసుముతో ఏప్రిల్ 4వ తేదీ వరకు చెల్లించే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.600, ప్రాసెసింగ్ ఫీజు రూ.200 ఉంటుందని వెల్లడించారు. పూర్తి వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్ లేదా వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

బీపెడ్ పరీక్షలు ప్రారంభం

డిచ్‌పల్లి, మార్చి 26 : టీయూ పరిధిలో బీపెడ్ 1వ, 3వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెంటర్‌లో ఉదయం జరిగిన పరీక్షకు మొత్తం 81 మంది విద్యార్థులకు ముగ్గురు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

టీయూ యూత్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా లావణ్య

డిచ్‌పల్లి, మార్చి 26 : టీయూలోని తెలుగు అధ్యయన శాఖ ఆచార్యులు కరిమిండ్ల లావణ్యను కల్చరల్ యాక్టివిటీస్ డైరెక్టర్, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా నియమించారు. వైస్‌చాన్సలర్ ఐఏఎస్ బుర్ర వెంకటేశం ఆదేశాల మేరకు ఆమెకు రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి నియామక ఉత్తర్వులను అందజేశారు.

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

డిచ్‌పల్లి, మార్చి 26 : ఎన్ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని టీయూలో మంగళవారం యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ ఎం.యాదగిరి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల వికాసానికి చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని తెలిపారు. అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ దత్తహరి మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ యూనివర్సిటీ అధ్యక్షుడు కొమిరె శ్రీశైలం, డాక్టర్ శ్రీనివాస్, నాయకులు రాజేందర్, సాగర్‌నాయక్, నిరంజన్, శ్రీకాంత్, విజయ్‌కుమార్, అశ్విన్, అనిల్, నవీన్, అనిల్ నంద పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ధర్పల్లి, మార్చి 26: మండలకేంద్రంలోని ఐకేపీ స్త్రీశక్తి భవనంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో బాలకృష్ణ హాజరై గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సమతుల్య ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రాల్లో తయారుచేసి తీసుకువచ్చిన పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బుజ్జి, శోభ, ఆరోగ్య సూపర్‌వైజర్ మేరి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

నేడు ఇందూరులో 5కే రన్

కంఠేశ్వర్, మార్చి 26: స్విప్ కార్యక్రమంలో భాగంగా నగరంలో బుధవారం 5కే రన్ నిర్వహిస్తుంచన్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను..' అనే అంశంతో ఉదయం 6 గంటలకు మున్సిపల్ కార్యాలయం నుంచి 5కే రన్ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఉద్యోగులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లతోపాటు అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా యూత్ తప్పకుండా పాల్గొనాలని కలెక్టర్ సూచించారు.

బాన్సువాడకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

కోటరిగి నుంచి బయల్దేరుతున్న నాయకులు, కార్యకర్తలు

కోటగిరి, మార్చి 26: బాన్సువాడ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ సన్నాహక సమావేశానికి ఉమ్మడి మండలం నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మంగళవారం తరలివెళ్లారు. వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా బయల్దేరారు.

తనిఖీల్లో రూ.2.29 లక్షల నగదు పట్టివేత

పొతంగల్ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న నగదుతో పోలీసులు

కోటగిరి, మార్చి 26: ఉమ్మడి మండలంలోని పొతంగల్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా మహారాష్ట్ర నుంచి వస్తున్న ఓ వ్యక్తి వద్ద రూ. 2లక్షల 29వేలు పట్టుకున్నామని ఎస్సై సందీప్ తెలిపారు. సీజ్ చేసిన డబ్బును బాన్సువాడ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించామని చెప్పారు.

54 లీటర్ల మద్యం స్వాధీనం..

డిచ్‌పల్లి, మార్చి 26 : అక్రమంగా తరలిస్తున్న 54 లీటర్ల లిక్కర్‌ను పట్టుకున్నామని ఎస్సై మహేశ్ తెలిపారు. 44వ నంబర్ జాతీయ రహదారి, సీఎంసీ మెడికల్ కళాశాల వద్ద అక్రమంగా మద్యం తరలిసుండగా పక్కా సమాచారం మేరకు దాడి చేశామని చెప్పారు. సుద్దులం గ్రామానికి చెందిన కొత్తపల్లి సందీప్ 54 లీటర్ల లిక్కర్‌ను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. సీజ్ చేసిన మద్యం విలువ రూ.13,650 ఉంటుందని తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

ఇందల్వాయి, మార్చి 26 : అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చిలువేరి దాసు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరి కోతలు ప్రారంభమయ్యాయని, రైతులు దళారుల చేతుల్లో మోసపోకముందే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అకాల వర్షం, వడగండ్లతో నష్టపోయిన రైతులను గుర్తించి పరిహారాన్ని అందించాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాశం కుమార్, ఆరెట్టి రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలన అందరి బాధ్యత

మోర్తాడ్ బస్టాండ్ ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

మోర్తాడ్, మార్చి 26: ప్లాస్టిక్ నిర్మూలన అందరి బాధ్యత అని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భూపతి అన్నారు. మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా వలంటీర్లు బస్టాండ్ ఆవరణను శుభ్రం చేయడంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ప్రయాణికులకు ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఈ-పాస్ ద్వారా ఎరువులు విక్రయించాలి

మోర్తాడ్, మార్చి 26: ఎరువుల దుకాణాల డీలర్లు ఈ-పాస్ ద్వారా ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సేన్ సూచించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను పరిశీలించారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈపాస్ మిషన్‌లు ఉన్నాయా లేదా పరిశీలించారు. ఈసందర్భంగా డీలర్లకు పలు సూచనలు చేశారు. డీలరు ఎవరైనా ఈపాస్ ద్వారా ఎరువులు విక్రయించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కూడా ఎరువులను ఈ పాస్ పద్ధతిలో కొనుగోలు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏడీఏ మల్లయ్య, ఏవో లావణ్య పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

బోధన్ రూరల్, మార్చి 26: బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుద్దెసావిత్రీ రాజేశ్వర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీలు అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. పీహెచ్‌సీలలో చిన్న పిల్లలకు సంబంధించిన కొన్ని టీకాలు ఉండడంలేదని, జిల్లా వైద్య అధికారులు మందులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్, తహసీల్దార్ గంగాధర్, ఎంపీవో మధుకర్,ఎంపీటీసీలు, విండో చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఏర్గట్ల, మార్చి 26 : ఏర్గట్ల సొసైటీ పరిధిలోని రైతులు విండో సేవలను సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య అన్నారు. మంగళవారం చైర్మన్ అధ్యక్షతన సొసైటీలో నిర్వహించిన మహాజనసభలో ఆయన మాట్లాడారు. రుణాలు తీసుకున్న రైతులు తిరిగి చెల్లించి సంఘం అభివృద్ధి తోడ్పడాలని కోరారు. అనంతరం సీఈవో శ్రీనివాస్ ఆదాయ, వ్యయాల వివరాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ సింగసారం గంగారాం, డైరెక్టర్లు బద్దం ప్రభాకర్, బద్దం హన్మాండ్లు, కొలిప్యాక శ్రీనివాస్, రెండ్ల రాజ రెడ్డి, జుంగల పెద్ద గంగారాం, జుంగల భూదేవి, ఇరపట్నం సాయన్న, భూక్య పెద్ద కిషాన్, భీమ గంగాధర్, గున్నవ్వ, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్, మార్చి 26: వేసవి కాలం దృష్ట్యా పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. మంగళవారం సాయంత్రం పట్టణ శివారులోని బెల్లాల్ చెరువును పాపనాగమ్మ ఆలయం వద్ద పరిశీలించారు. బోధన్ పట్టణానికి తాగునీటితో పాటు పరిసర ప్రాంతాల రైతులకు సాగునీరందించే చెరువులో నీటి సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రజలు తాగునీటి కారణంగా ఏవైనా ఇబ్బందులు పడితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. నిజాంసాగర్ కాలువ ద్వారా నీటిని నింపేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ ఎంపీపీ గంగాశంకర్, పాషా మొయినుద్దీన్, తూము శరత్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, సంజీవ్ రెడ్డి, ఇంద్రకరణ్ తదితరులు ఉన్నారు.

కబ్జా చేసిన కాలువలను తీయిస్తాం..

బెల్లాల్ చెరువులో నీరు నింపేందుకు ఉన్న కాలువను కొందరు కబ్జా చేశారని ఎమ్మెల్యే తెలిపారు. కబ్జాలకు పాల్పడిన విషయం రైతులకు తెలుసని, పంట కోతల అనంతరం కబ్జా జరిగిన కాలువను తీయించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. రైతులు ఈ విషయంలో సహకరించాలని ఆయన కోరారు.

అలీసాగర్ రిజర్వాయర్‌ను సాగర్ నీటితో నింపుతాం

ఎడపల్లి, మార్చి 26 : ఎడపల్లి మండలం ఠాణాకలాన్ గ్రామంలోని అలీసాగర్ రిజర్వాయర్‌ను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజర్వాయర్‌లో నాలుగు అడుగుల వరకు నీటి నిల్వ తక్కువగా ఉందని ఐదు రోజుల్లో నిజాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేయిస్తామని తెలిపారు. జూన్ వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు.

అలీసాగర్ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

కాంట్రాక్ట్ కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి

బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖాన ఎదుట ధర్నా

ప్రభుత్వ దవాఖాన ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

శక్కర్‌నగర్, మార్చి 26: బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తమ వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ మంగళవారం దవాఖాన ఎదుట ధర్నా చేపట్టారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ అనుబంధంగా కార్మికులు విధులను బహిష్కరించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సదరు సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ కార్మికులకు మూడునెలల వేతనాలు చెల్లించాలని, ఈనెల 6న అధికారులు, కాంట్రాక్టర్‌కు సమ్మె నోటీసు అందజేసినా స్పందించకపోవడంతో ధర్నా చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, నాగమణి, సతీశ్, జాఫర్, మాధవి, సాయిలు, దత్తు, కార్మికులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 2న నీటి విడుదల నిలిపివేత

ముప్కాల్, మార్చి 26: ఎస్సారెస్పీ నుంచి కాకతీయ ప్రధాన కాలువకు ఏప్రిల్ 1వ తేదీ వరకు నీటి విడుదల కొనసాగుతుందని ఈఈ చక్రపాణి మంగళవారం తెలిపారు. 2న ఉదయం 6 గంటల వరకు జోన్-2 ఆయకట్టుకు సాగునీరు ఇస్తామని, అనంతరం కాలువకు నీటి విడుదలను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఇదే చివరి తడి అని రైతులు గమనించాలని సూచించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091.00 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 1062.90 అడుగుల (17.183 టీఎంసీలు) వద్ద ఉన్నదని తెలిపారు. నీటిని రైతులు పొదుపుగా వాడుకోడాలని విజ్ఞప్తి చేశారు. జోన్-1 ఆయకట్టు పరిధిలోని అన్ని తూములను మూసివేయాలని కాలువ సిబ్బందికి సూచించారు.

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్యా యత్నం

కాపాడిన యువకులు

నందిపేట్, మార్చి 26: నందిపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రఘునాథ చెరువులో దూకి ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించగా గమనించిన ఇద్దరు యువకులు కాపాడారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా లింగాయపల్లికి చెందిన విజయ అనే వివాహిత కుటుంబ ఆర్థిక సమస్యలు, భర్త వేధింపులు తాళలేక నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లింది. మంగళవారం నిజామాబాద్ జిల్లా నందిపేట్ చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించగా.. అటుగా వెళ్తున్న మచ్చర్ల సాగర్, ఉమ్మడ ట్రాక్టర్ ఊశన్న ఇద్దరు వెళ్లి ఆమెను కాపాడినట్లు స్థానికులు తెలిపారు. విజయ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మాక్లూర్, మార్చి 22 : మండలంలోని ధర్మోరా గ్రామశివారులోని సామెల్ చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు చెరువులో నుంచి మృతదేహాన్ని బయటికి తీయించామని, మృతుడి వయస్సు 40 ఏండ్లు ఉండవచ్చని పేర్కొన్నారు. ఒంటిపై నైట్ పాయింట్, రెడ్ గీతల చొక్క ధరించి ఉన్నాడని, ఆచూకీ కోసం మాక్లూర్ పోలీసులను సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన పోస్టుమార్టం గదికి తరలించి, కారోబార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నందిపేట్ మండల కార్యాలయంలో 'సామాజిక తనిఖీ'

మాక్లూర్, మార్చి 26: మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా సామాజిక తనిఖీ వేదిక కార్యక్రమాన్ని ఎంపీడీవో జైక్రాంతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి హాజరయ్యారు. మండలంలోని 30 గ్రామాల్లో ఏప్రిల్ 2022 నుంచి ఏప్రిల్ 2023 వరకు రూ.3.50 కోట్ల నిధులతో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. గ్రామాల వారీగా ఎఫ్ఏలు, కార్యదర్శులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి ఇచ్చిన పనుల నివేదికలను నమోదు చేసుకున్నారు. కూలీలకు జాబ్ కార్డులు అందించాలని, రోజ్‌గార్ దివస్ రిజిష్టర్ నిర్వహించాలని, ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ సాయాగౌడ్, జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, స్టేట్ రిసోర్స్ పర్సన్ రాఘవులు, ప్రోగ్రాం మేనేజర్ అశోక్‌కుమార్, ఏపీవో ఓంకార్, ఐకేపీ ఏపీఎం అనిల్‌కుమార్, సామాజిక తనిఖీ సభ్యులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

పల్లికొండలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

భీమ్‌గల్, మార్చి 26 : మండలంలోని పల్లికొండ, పురాణిపేట్ గ్రామాల్లో ఎంపీడీవో సంతోష్‌కుమార్ మంగళవారం పర్యటించారు. ఉపాధిహామీ పథకం కింద ఏర్పాటు చేసిన నర్సరీలను ఆయన పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించి పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్య లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేసి సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీవో నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **మానాలకు సన్మానం:** వేల్పూర్, మార్చి 26 :రాష్ట్ర సహకార సంఘాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమమితులైన మానాల మోహన్‌రెడ్డిని కుకునూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మానాలను శాలువాతో ఘనంగా సన్మానించారు. భూమారెడ్డి, రవి, రామన్, నాయకులు ఉన్నారు.

● **మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సత్కారం:** ఆర్మూర్‌టౌన్,మార్చి26: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అయ్యప్ప శ్రీనివాస్‌ను ఆమె నివాసంలో మంగళవారం బాల్యమిత్రులు పూలమాల వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

అంతర్రాష్ట్ర సరిహద్దులో తనిఖీలు: రెంజల్, మార్చి 26 : మండలంలోని కందకుర్తి అంతర్రాష్ట్ర సరిహద్దులో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టినట్లు రెంజల్ ఎస్సై సాయన్న తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మహారాష్ట్ర - తెలంగాణ సరిహద్దులో మద్యం, నగదు తరలించే అవకాశం ఉండడంతో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**మొ